మా ఆవిడా, మోరిస్ మైనరూ

గొల్లపూడి మారుతీరావు

అసలు నేను కారు కొని తీరా లని మా ఆవిడికి ఆలోచన వచ్చింది——ఇంజనీరుగారి భార్య తో పేరంటానికి వెళ్ళినప్పుడు ఒకసారి కుంకుడుకాయలు అప్ప డిగితే యివ్వలేదనీ, మా పెరట్లో జామచెట్టు వాళ్ళ కాంపౌండు లోకి వంగితే రెండుకాయలు

తెంపేసు కున్నారనీ, పచ్చడి రుబ్బుకునే రోకలిబండని యివ్వమని పనిమనిషిని కబురు పంపిస్తే యివ్వలేదనీ ఇంజనీరు గారు భార్య మీద మొదట్నుంచీ కోపంగానే వుంది మా ఆవిడకి.

ఎందాతనో ఆ రోజు పేరంటంలో కలిస్తే-మాట వరుసకి తనతో కారులో రమ్మని ఆవిడ ఆహ్వానించిందట. మా ఆవిడ పిల్లలతో సహా కారులో కూర్చుందట. అంతవరకూ బాగానేవుంది. కారులో ఉండగా పసుపు అంటుకున్న చేతుల్ని కారు సీట్లు మీద దులుపుకో బోయిందట. ఆవిడ గమనించి వెంటనే "కొత్త సీట్లు కవర్లండి పాడవుతాయి'' అందట. అంతే. ఆ మాట నా ప్రాణం మీదికి వచ్చింది.

నేవారోజు సైకిలుదిగి యింట్లోకి రాగానే చిరునవ్వుతో ఎదురయింది మా ఆవిడ. అప్పుడే మనస్సు ఏ మూలో కీడు శంకిస్తూనేవుంది దానికి తోడు. కాళ్ళూ, చేతులూ కడుక్కోగానే 'గులాబ్ జామ్' ప్లేటు తెచ్చి చేతికి అందించింది. అంతే. నాకు గుండె జారిపోయింది. ఏదో పెద్ద ప్రమాదానికి సిద్ధపడిపోయాను. అయాచితంగా మా ఆవిడ చేసే సేవల మీద నాకు బొత్తిగా నమ్మకంలేదు. ఆఫీసు మంచి వచ్చాక-బుజ్జిగాడిని చుట్టుప్రక్కల అయిదారు యిళ్ళకు పంపితేకాని కనిపించని మాఆవిడ, యింట్లో ఉండడం ఇలా ఫలహారం అందించడం—పాకిస్తాన్‌వాళ్ల హఠాత్తుగా స్నేహితులయి పోయినంతటి షాక్ నాకు.

ప్రక్కింటికెళ్ళి పప్పు రుబ్బుకొచ్చేందుకు కారు. మిషను కెళ్ళి పసుపు పట్టించుకొచ్చేందుకు కారు.

ఇండియాలో మారిస్ మైనర్ కారులు వున్నంతకాలం రుబ్బు రోళ్లు,రోకళ్లూ హాయిగా కారులో ప్రతి యిల్లు తిరుగుతూనే వుంటాయి.

సరే, నెలాఖరుఅయినా యాభై రూపాయల చీరెకి "ఇవాళ వొంట్లో ఏం బాగు లేదా? ఈ స్వీట్సు అవీ ఎందుకు చేసేశావ్?'' అని సీరసంగా అడిగాను. మా ఆవిడ చిలకలాగ నవ్వింది ఆ మాటకి. మా ఆవిడలో నేను ఆనందించే తక్కువ విషయాల్లో ఆ నవ్వొకటి. అదిచూడగానే మనస్సు ఎయిర్ కండిషన్ చేసినటు అయిపోయింది.

"మీరు మరీనండీ. నాకు వంట్లో బాగులేకేం? రోగం-బాగానే వుంది'' అంది.

ఆ తర్వాత మెల్లగా అసలు విషయం చెప్పింది. కారు-పేరంటం పసుపు చేతులు ఇంజినీరు గారి భార్య అన్న మాటలు—వగైరా.

అంతా చెప్పి-ముఖం ఎర్రగా చేసు కొని-"ఇంతోటి బోడికారుందని-ఆవిడకి మిడిసి పాటు చెయ్యొద్దిలించుకో తోయే పనికి నోర్కుంది కదా అని మాట అనే పింది. ఆవిడకి తగిన పాఠం చెప్పక పోతే నేను ఆదిభట్ల వెంకటనారాయణ కూతురునే కాదు. నా పేరు అప్పల నర సమ్మేకాదు." అంది.

"నువ్వు కాదన్న అవక తప్పుతుందా ఏమిటి? నీకు కోపం వచ్చిందని పేరు మార్చుకుంటే తర్వాత చాలా చిక్కు లున్నాయి. కొత్త పెళ్ళాన్ని తెచ్చుకున్నా ననుకొని నా వుద్యోగం తీసేస్తారు. యింతకీ ఎలా పాఠం చెప్పదలచుకు న్నావు." అన్నాను మనస్సు ఏదోకీడును శంకిస్తూండగా.

"ఎలాగేవిటండీ. మళ్ళీ వరలక్ష్మీ వ్రతం నోము నాటికి మన సొంతకారులో పేరంటానికి వెళ్ళి తీరాల్సిందే."

ఆ మాట వినగానే నాకు శరీరమంతా తిమ్మిరెక్కినట్టయిపోయింది. చెవులు పని చెయ్యడం మానేశాయి. పదిరోజులు పత్యంమీద బతికిన టైఫాయిడ్ రోగిలాగ నరనరాల్లోను నీరసం వచ్చేసింది.

"నరసూ- నువ్వు చెప్పింది సరిగ్గా విన్నానా లేదా?" అన్నాను ఇంకా అను మానంగా.

"వినిపించకపోతే మళ్ళీ చెప్తావినండి. వచ్చే వరలక్ష్మి వ్రతానికి-మనం కారులో వెళ్ళాలి. ఆవిడకి రోగం కుదరాలి" అంది.

కుదిరేది ఆవిడ రోగం కాదని నాదని మా ఆవిడకి నచ్చ చెప్పలేక పోయాను.

"పోనీ రెండు జతల కారు సీటు కవర్లు కొనిస్తాను. నీకపతీరా వాటినిండా పసుపు జల్లెయ్. వాళ్ళింటికి తీసుకెళ్ళి చూపించి వస్తాను. ఆవిడ రోగం కుదిరి పోతుంది." అన్నాను.

"ఛీ ఛీ నేను పంతం పట్టాక అలా లాలూచీ పడతాననుకున్నారేమిటి?" అని కసురుకుంది.

అప్పటికి ఊరుకుని మళ్ళీ రాత్రి నచ్చ జెప్పబోయాను: "నరసూ! నాకు 500 రూ॥ల జీతం అని మరిచిపోయావా?"

"మరేం ఫరవాలేదు. ఆ యింజినీరు గారికి అంతేగా జీతం?"

"ఆయన రెండు చేతుల్తోనూ సంపా దిస్తున్నాడు."

"మీకు సంపాదించడం చేతకాదని చెప్పండి."

"కాలేజీ లెక్చరరు గాడికి ఎవడిస్తాడే లంచాలు? సరిగ్గా కాపీ కొట్టనివ్వక పోతే

పొడిచేస్తా మంటున్నారు స్టూడెంట్లు అన్నాను దిగులుగా.

కాని మా ఆవిడ నిర్ణయం చెక్కు చెదరలేదు. ఇంటి ఖర్చులు ఎలా ఆదా చేస్తుందో చెప్పింది.

ఇకనుంచీ రాత్రివేళ రొట్టెలు చేస్తుందట. కొబ్బరికాయల ధర పెరిగిందిగనుక ఆ పచ్చడి మానేస్తుందట పట్టు జర్తారు చీరెకు బదులు కోయంబత్తూరు చీరెలు వాడుకొంటుందట. ఇక నుంచి కోపం వచ్చినా రివాజు ప్రకారం పుట్టింటికి సంవత్సరానికి 3 సార్లు కాక 2 సార్లే వెళ్తుందట యిలాంటివి చాలా చెప్పింది.

'ఇదంతా ఒకవారం పెట్రోలు ఖర్చుకు రాదన్నాను.' అంతే ఆవిడికి కోపం వచ్చింది. ఆ మర్నాడు కొబ్బరికాయ పచ్చడి మాట దేవుడెరుగు:—కంచంలో కూరలేదు. రాత్రి రొట్టెలులేవు మజ్జిగలో పులుపు ఎక్కువయింది. బాయిలర్ వేడెక్కలేదు. వాయిదాల ప్రకారం పిల్లల వీపులు వరసగా ఛెళ్ళుమంటున్నాయి. రాబోయే యుద్ధానికి యిది సూచన.

మరో పద్ధతి చెప్పాను మా ఆవిడకి. "ఇంజినీరుగారి భార్య సీటు కవర్ల మీద నీ చేతులు దులుపుకోనియ్యలేదన్నావు. బాగుంది. రేపు తెల్లవారు ఝామునే వాళ్ళ

కాంపౌండులోకి దూరి బ్లేడు పెట్టి ఆ సీటు కవర్లని కోసేస్తాను. పీకపి తీరిపోతుంది కదా?'' అన్నాను - జీవితంలో ఎప్పుడూ ఎరుగని దొంగతనానికి కూడా సిద్ధ పడుతూ.

''ఛీ-ఛీ! అలాంటి పని చెయ్యడానికి మీకు సిగ్గు లేదూ?'' అంది. నిజమే! సిగ్గు పడిపోయాను మా ఆవిడ చెప్పాక. ఆవిడ పంతానికి వాళ్ళాయన తల వొంచి కారు కొనిపించడానికి సిగ్గు పడడం లేదు కాని, నేను గోడ గెంతితే మా ఆవిడ సిగ్గు పడి పోయింది. సంస్కారం కూడా ఒకప్పుడు అలా ఎదురు తిరుగుతుంది కాబోలను కున్నాను.

సరే యింక ఏ మార్గమూ కనిపించ లేదు. పది రోజులు మానసిక చిత్రవధని అనుభవించాక - బేషరతుగా నా ఓటమిని అంగీకరించాను. కారు కొనడానికి నిర్ణయ మయింది.

ఒక మంచిరోజు చూసి యిద్దరం కూర్చుని డబ్బు ఎలా సమకూర్చుకోవాలని లెక్కలు వేశాం. నా కాలేజీ పరీక్ష పేపరు దిద్దిన డబ్బు 256 రూపాయలు. బాంకులో డబ్బు మరో రెండు వందలు కనిపించింది. పండగకి కొత్త బట్టలు కొనుక్కోడానికి వాళ్ళ నాన్న పంపించిన 100 రూపాయలు అతి ఉదారంగా నాకివ్వడానికి అంగీక రించింది మా ఆవిడ. అంతా చేరి 556/- అయింది. నా జీ. పి. యఫ్ లోనే 2000 తీశాను మరో రెండు వేలు అటు పడి-ఇటు పడి ఒక కాబూలీవాలా దగ్గర జీవి తంలో మొదటిసారిగా అప్పు చేశాను.

వారం తిరక్కుండా మరో దుర్వార్త తెచ్చింది మా ఆవిడ. వీధి చివర మిలటరీ మేజర్ కర్తాన్‌సింగ్‌కు బదిలీ అయిందట. మరొకప్పుడయితే ఆ వార్త అశరీరవాణి చెప్పిన దివ్యసందేశం లాగ నా చెవులని వినిపించేంది. ఎందుచాతనంటే ఆ మేజర్ కారు వల్ల, దాని శబ్దం వల్ల ఖాయిలా పడి పోయిన దురదృష్టవంతుల్లో నేనొకణ్ని. అయితే వెంటనే దుర్వార్త మా ఆవిడ చేర్చనే చేర్చింది. అతని కారు అమ్మ

ఎస్. ఎస్. ఎల్. సి. ——————

● స్కూలు జీవితంలో చివరి మెట్టు.

(పెద్దల మాటల యెడల నమ్రత, వినయ విధేయత మొదలుగాగల (సు)గుణాలు వదలివేయు దశ)

లనుకొంటున్నాడట. అది వినగానే నా గుండె పగిలి పోయింది. నిజానికి ఆ మేజర్ మా వీధికి వచ్చినప్పట్నుంచీ వీధిలో ఎవరూ సుఖంగా నిద్ర పోలేదు. ఆయన కారు పదేళ్ళనాటి మారిస్ మైనరు. రాత్రీ-పగలూ నడిచినప్పుడల్లా కంకర రాళ్ళ బండీ వెళ్ళినట్టు హోరెత్తించేస్తుంది. వెలుగు రాపిన కుక్క-గొంతులాగ హారన్. రాత్రి తాగి వస్తాడేమో హారన్ మీద చెయ్యి తియ్యడు. కారంతా ఒక పక్కకి వంగి పక్కకి నిలబడిన వాళ్ళకి తమమీదకి వచ్చేస్తున్నట్టుంది ఆ కారు. అరమైలు దూరం నుంచీ దానిచప్పుడు—పిండి మర లాగ కిరకిరలాడుతూ వినిపిస్తూంటుంది. రెండీళ్ళవతల హెడ్మాష్టరుగారికి ఆ శబ్దం వినలేక గుండెజబ్బు ఎక్కువయి మంచం పట్టాడు. ఆయన వెళ్ళిపోతున్నాడంటే వీధివీధంతా ఏకగ్రీవంగా సంతోషించారు. కాని దాన్ని మా ఆవిడ నా చేత కొనిపించాలనుకొంటోందని విని అందరికి బెంగ ఎక్కువయింది. ఓ పది మంది చిన్న కమిటీలాగ ఏర్పడి నా దగ్గర రాయబారం వచ్చారు ఆ కారు కొనవద్దని. మరీ ముసలాయన, ఇన్కం టాక్సు ఆఫీసరు గారి తండ్రి. "అయినా బడిపంతులకి నీకు కారెందుకయ్యా. పోయే కాలమా?" అన్న భావం కాస్త మెత్తటి మాటల్లో వ్యక్త పరిచాడు. ఆ బృందానికి రెండు చేతులూ జోడించి "అయ్యా ఆ కారుమీద మీ కెంత సదభిప్రాయం వుందో నాకూ అంతే సదభిప్రాయంవుంది. నా అంతట నన్ను అది కొంటావా అర్ధసేరు వంటా మదం తాగుతావా అంటే, మంచి నీళ్ళ ప్రాయంగా ఆ మదమే సేవిస్తాను. మీకు దమ్ముంటే మా ఆవిడని ఒప్పించండి." అన్నాను వాళ్ళు మా ఆవిడ నోరుకి భయపడి వెనక్కి వెళ్ళారు. అయినా ఆశ చావక ఒక మహిళా బృందాన్ని మా ఆవిడ మీదకి తోలారు, కాని ఆవిడ అభిప్రాయాన్ని ఆడవాళ్లెవరూ మార్చలేక పోయారు.

"విశేషంలాంటి కారు మనం కొనుక్కొంటూంటే కళ్ళు కుట్టి వాళ్ళు ఏడుస్తున్నారు" అంది.

పి. యు. సి. ——————

● విశ్వవిద్యాలయానికి తొలి మెట్టు.

(వ్యక్తిత్వం, నాయకత్వం, ఆ తత్వం, ఈ తత్వం (అవసరమైతే అసలు తత్వమే మారిపోవచ్చు) నేర్చుకొనే తత్వాల తొలి దశ.)

''నిన్నటి దాకా ఆ కారునీ, ఆ మేజర్నీ నువ్వూ తిట్టావు కదే!'' అన్నాను.

''అది వేరే సంగతి. నిన్న నేను చూసివచ్చాను. గచ్చకాయ రంగుకారు. బుజ్జిముండ—ఎంత ముద్దుగా వుందను కొన్నారు.'' అంది ఆనందంతో ఉబ్బి తిరిగిపోతూ.

''బుజ్జిముండ ఎవరు'' అన్నాను అర్థం కాక.

''అదేనండీ-కారు!'' అంది. నా పెద్ద కొడుకుని కూడా మా ఆవిడ అంత ముచ్చటగా లాలించి వుండదు. తీరా అంత వ్యామోహం పెంచుకున్నాక ఇంక కొనక గత్యంతరం లేదని అర్థమయిపోయింది.

ఒక మంచిరోజు చూసి ఓ సాయంకాలం మేజర్గారింటికి వెళ్ళాను. ఆయన విస్కీ-సేవిస్తూ మంచి కిక్కులో వున్నాడు. ఆయన కారు కొనాలనుందని చెప్తే మొదట షాక్ అయిపోయాడు. తన జీవితంలో ఆ కారు అమ్మడం సాధ్యమవుతుందని వూహించలేదనుకుంటాను. ఎగిరి గెంతేశాడు-నా ఆర్థికస్థితి. ఆ కారు కొనడానికి కారణాలు అవీ వివరించి—కేవలం 4000/- యిచ్చుకొంటానని మొరపెట్టుకొన్నాను. నానోట్లో మాట నోట్లో ఉండగానే అంగీకరించాడు మేజర్.

అంతేకాదు. మర్నాడే ఆ కారు మా యింట్లో తీసుకువచ్చి వదిలేశాడు మేజర్. ఆ రోజు మా ఆవిడ ఆనందం వర్ణనాతీతం తన పెళ్ళి నాడు కూడా అంత ఆనందంగా కనిపించలేదు. కారుకి హారతిచ్చి, దిష్టితీసి, నా చేత పట్టుపంచ కట్టించి పూర్ణకుంభంతో ఎదురు తీసుకు వెళ్ళి దానికి నోటికొచ్చిన పద్యాలన్నీ చదివింది- ఆంజనేయ దండకము మొదలుకొని, సరస్వతీ నమస్తుభ్యం వరకూ. కారు కొనడంతో నా సమస్యలు తీరిపోతాయనుకున్నాను కాని కొత్త సమస్యలు ఎదురవుతాయని వూహించలేదు

ఆ మర్నాటి ఉదయం అయిదు గంటలకే లేచి నన్నూ లేపి కారు శుభ్రం చెయ్యడానికి రెండు బాల్చీల నీళ్లు అందించింది. ''అంత డబ్బుపోసి కారుకొన్నాక దాన్ని శుభ్రంగా ఉంచుకోకపోవడం ఎలాగండీ'' అంటూ.

ఆ రోజునుంచి అయిదు గంటల నుంచి ఆరువరకూ కారువెనుక సీటులో నిద్రపోవడం అలవాటు చేసుకున్నాను.

ఒక రోజు హఠాత్తుగా గుర్తుచేసింది. ''ఏమండోయ్ ఎల్లుండి వరలక్ష్మీ వ్రతం'' అంటూ.

''అయితే నన్నేం చెయ్యమన్నావు. కారుందిగా! నీ కోరిక తీరిందిగా!'' అన్నాను.

''కారుంటే సరిపోయిందండీ— వాళ్ళంతా చూడొద్దూ. రేవట్నుంచి పిలుపులకి వెళ్లాలనుకొన్నాను. మీరు రాకపోతే కారులో వెళ్ళేదలా!'' అంది.


టానిక్ ఏదైనా ఆకలిని మాత్రమే
పెంచగలిగితే అది సగం పనిని మాత్రమే చేసినట్లు అవుతుంది
ఇన్‌క్రిమిన్ ఇవ్వండి...
అది అధిక ఆహారమును అధిక పెరుగుదలగా మారుస్తుంది.
ఇన్‌క్రిమిన్ దళంలో చేరండి...
పెరుగుదల నిచ్చు ఆకలి పొందండి!
అన్ని మందుల షాపులలో లభించుచున్నది
ఇన్‌క్రిమిన్* టానిక్
పెద్ద పిల్లలకు (ఐరన్‌తో కూడిన)
ఇన్‌క్రిమిన్ సిరప్—175 మి.లీ. & 57 మి.లీ.
పసి బిడ్డలకు 10 మి.లీ. ఇన్‌క్రిమిన్ డ్రాప్స్
Incremin drops LYSINE-VITAMINS
Lederle
* అమెరికన్ సయానమిడ్ కంపెనీ వారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కు
లింటాస్-INC. 20.337 TL

అంతే ఆమె గొప్పతనాన్ని ప్రదర్శించ డానికి ఆ తర్వాత రెండు రోజులు ఆఫీసుకు శలవుపెట్టి మా ఆవిడని ప్రతీ యింటికీ తిప్పాను. ఆ వూళ్ళో ఆడవాళ్ళె వరీవి వదలకుండా, అందరినీ పేరుపేరునా పిలచుకు వచ్చింది. అందరినీ గుమ్మంలోకి తీసుకువచ్చి కారు చూపించింది. చూపించి, చూపించి అంతలో యేదో జ్ఞాపకం వచ్చినట్టు స్టీరింగు ముందు చెమటలు కక్కుకుంటూ కూర్చున్న నన్ను చూపించి "అయ్యో నా మతి మండా! చెప్పడమే మర్చిపోయాను దొడ్డమ్మగారూ! ఆ ముందు సీట్లో చక్రంముందు కూర్చున్నది మా వారే!" అని పరిచయం చేసింది.

"అలాగుటమ్మా-యింకా మీ డ్రైవరు అనుకున్నాను." అని ఒక ముసలావిడ అననే అంది కూడాను. ఆ విధంగా చాలా పరపతిని సంపాదించుకు వచ్చింది మా ఆవిడ. ఇంటికి వచ్చాక పీరసంగా అన్నాను. "ఏకంగా వూరంతటినీ పిలిచేస్తున్నావు 'కారుకి ఎలాగాతప్పలేదు. పేరంటానికి మరో కొత్త అప్పు చెయ్యమంటావా ఏమిటీ!' అన్నాను.

"అయ్యో! శుభమా అని వ్రతం చేసుకొంటూంటే అవేం మాటలండీ- వచ్చే జన్మలోనూ మీరే భర్తకావాలని చేసే వ్రతం యిది కాదనకండి." నా గుండె జారిపోయింది. ఈ కారు. డ్రైవరు పదవీ యివన్నీ వూహించుకొని- వచ్చే జన్మకయినా నన్ను కరుణించు తల్లీ అని వరలక్ష్మికి మనస్సులోనే మొక్కుకున్నాను.

ఇక-కారులేందే బయటికి వెళ్ళే అలవాటు మానుకుంది మా ఆవిడ. ఒక సాయంకాలం యింటికి వచ్చేసరికి గోధుమలు డబ్బా పెట్టుకుని-వాకట్లోకూర్చుంది. నన్ను చూడగానే "పదండి-పదండి.... వేళయిపోతుంది" అంది.

"ఎక్కడికి?" అన్నాను అర్థంకాక.

"పిండి మరకి- మరో పావుగంటలో కట్టేస్తారు" అంది.

"పిండిమరకి కారెందుకు? ఆ పెట్రోలు ఖర్చుతో మరో రెండు కిలోలు గోధుమలు కొనుక్కోవచ్చు" అన్నాను.

"అయ్యో—రామ అనవసరమయిన చోట ఆదా చెయ్యడంలో మీరు ఫస్టు. ఇవాళ శనివారం. విసిరించుకోపోతే రాత్రి వస్తే-పదండి....పదండి" అని అంది.

"మరి ముందే పని మనిషిని ఎందుకు పంపలేకపోయావు?"

"మధ్యాహ్నం వెంకుబాయమ్మగారి మనమరాలు వచ్చిందని మాట్లాడుతూంటే పని మనిషి వెళ్ళిపోయింది."

ఇక తప్పలేదు. పిండి మర ప్రయాణానికి సిద్ధపడ్డాను. మా ఆవిడ లోపలికి వెళ్ళి క్షణంలో రెండు యిత్తడి గిన్నెలు, ఒక సీసాతో సహావచ్చింది.

"మళ్ళీ యివేమిటీ" అన్నాను.

"ఎన్నాళ్ళ నుంచో-ఈ గిన్నెలు చిల్లు పడిపోయాయండీ. బజారికి వెళ్తున్నాం కదా ఏకంగా మాటువేయిందుకు వచ్చేద్దాం" అంది.

"మరి ఈ సీసా?"

"అన్నీ మీకు చెప్పాలి ఖర్మ.... నువ్వుల నూనె అయిపోయింది. తెచ్చుకోకపోతే అవుతుందా?"

"ఐతే పీటికన్న మాట కారు."

"ఐతే ఏమిటి మీరనేది? సినిమాస్టారుల్లాగ తిరగడానికేమిటి కారు? ఇంటిపనులు చేసుకోనక్కరలేదా?" అంటూ కస్సుమంది.

మొదటి తప్పు చెయ్యాలే కాని - తర్వాత అనడానికి వీల్లేదు. పిండి మరకీ, ఇత్తడి దుకాణానికీ, నూనె దుకాణానికి వెళ్ళాం. మా ఆవిడ కారు ప్రయాణాన్ని అనుక్షణం ఆనందిస్తోంది. దారిని పోయే వాళ్ళని గట్టిగా పిలిచి పలకరించి. "ఏమండోయ్, పంకజంగారూ! బజారుకేనా?" అని రోడ్డుమీద వాళ్ళంతా హడలి పోయేలాగ పిలుస్తోంది. ఆ పంకజాక్షి రోడ్డు పక్కన నడిచి పోతూంటే—"మేమూ అటువేపే వెళ్తున్నాం. కారులో వెళ్దాం రండి." అంటూ లోనికి ఎక్కించింది. అసలే ఒక పక్కకి ఒంగి నడిచే కారు. ఆవిడ 250 పౌన్ల శరీరాన్ని తట్టుకోలేక కిర-కిర లాడింది. ఆమె కూర్చున్న సీటు మీద ఉన్న నూనె సీసా సీటు మీదే ఒలికింది. పంకజమ్మ వాళ్ళ యింటిదగ్గర దిగేనరికి మా ఆవిడ కొన్న నూనె సగం ఆవిడ చీరెకీ, సగం నా కారు సీట్లకీ ఉంది. నువ్వుల నూనె వాసన కారుని పదిరోజుల వరకు పట్టుకు వదలలేదు.

ఓ రోజు మడత మంచాలకి కొత్తగుడ్డ కుట్టించాలని అవన్నీ బయటికి తీసింది. రిక్షావాడు రూపాయి అడిగాడని వాడిని కసిరి బొమ్మని చేంతాడుతో కారు టాపుకి వేసి రెండు మంచాలు కట్టింది.

పెట్టె

❀ "లోపలికి రా!" తన స్నేహితుడిని పిలిచాడు మరో మిత్రుడు.

"నాకేసే చూస్తోంది నీ కుక్క. ఏమీ చెయ్యదుగదా!" ఆ స్నేహితుడు లోపలికి రావటానికి సంశయించాడు.

"ఏం చేస్తుందో చూద్దామనే నిన్ను ఆహ్వానిస్తున్నాను. దీన్ని ఈ రోజే కొన్నాన్లే" అన్నాడాతను.

—కె. ప్రసాద్, సికింద్రాబాద్.

"విశేషం లాంటి కారుకి యిదేం ఖర్మే!" అన్నాను.

"అదేమిటండీ - కారుంది కదా అవి మంచాలు పారేసుకొంటావేమిటి? మనల్ని చూసి నవ్వే వాళ్ళ పళ్ళే బయట పడ తాయి" అంది.

పరాయివాళ్ళ పళ్ళేమో కాని మంచాల్ని షాపు దగ్గర దింపుతుండగా ఒక మంచం జారి నా ముందు పన్ను విరిగి పోయింది.

క్రమంగా కారు నా జీవితంలో పీడక లగా తయారయింది. ఇంకా ఏ కొత్త అవాంతరాలు వచ్చి పడతాయో మా ఆవిడకి ఏ కొత్త ఆలోచనలు వస్తాయో అని హడలి ఛస్తున్నాను.

ఇంతలో యింజనీరుగారి భార్య కి రోగం కుదిరిందో లేదో తెలీదు కాని ఓ శనివారం రెండో ఆట సినిమాకి వెళ్ళి వచ్చి కారుని వాకిట్లో వుంచి ఉదయం లేచి చూస్తే వెనుక సీటు కవర్లు బేడుతో కోసేసి వున్నాయి. అది చూసి మా ఆవిడ గంగవెర్రులెత్తిపోయింది. నాకూ మనసు చివుక్కుమంది.

"ఏ వెధవలు చేసిన పనండీ యిది?" అని గదమాయించింది మా ఆవిడ వాళ్ళకి నేను ప్రతినిధిలాగ.

"ఎవరయితేనేం? నేను ఇంజినీరుగారి కారు సీట్లు కోసేస్తానంటే చెయ్యనిచ్చావు కాదు. మనం కారు కొని వాళ్ళు మన సీట్లు కోసేసేదాకా ఆగావు - నీకున్న పెద్ద మనిషి తరహా నీ పక్కవాడికి ఉంటుం దనుకోవడం పొరపాటు" అన్నాను.

ఐతే ఈ సంఘటనతో కొత్త అవాం తరం వచ్చి పడింది. అంతవరకూ తెల్ల వారు ఝామునే బయట పడుకొనే వాడివి. ఆ రోజునుంచీ కారు పక్కనే మంచం వేసింది మా ఆవిడ. "ఏమే! యివాళ సీటు కవర్లు కోసేసిన వాళ్ళు రేపు నా పీక కోసేస్తే ఏం దారి?" అన్నాను మా ఆవి డతో దీనంగా.

"మీపీక కొయ్యడానికి ఎంత ధైర్యం. అందులో కవర్లు నోరు లేనివి. మీ పీక కోసేస్తే గట్టిగా అరవండి నేనొచ్చి వాళ్ళ దుంప తెంచుతాను" అంది.

అంతే.... ఇంకే మార్గాంతరం లేదు. చేసుకున్న పాపంలాగ కొనుక్కొన్న కారుకి కాపలా పడుకోవడం అలవాటు చేసు కొన్నాను.

వారం గడిచాక—

"సరసూ! నీతో ముచ్చటగా కబుర్లు చెప్పుకు వారం రోజులయిపోయిందే!.... నీ కోసం బెంగ పెట్టుకున్నాను. ఇలా భార్యా భర్తల్ని విడదీసే కారు లేకపోతే ఏం? చెప్పు...." అన్నాను.

ఏ ముఖాన వుందో మా ఆవిడకి ఆ మాటకే భోరున కన్నీళ్ళు వచ్చేశాయి— "బాధ పడకండి. అన్ని రోజులు ఒకలాగ



ఉంటాయా? ఆ యింజినీరుగారికి బదిలీ అయిపోతుందట. ఆ రాక్షసులు వెళ్ళగానే మళ్ళీ మీరు లోపలికి వచ్చి పడుకోవచ్చు" అంది.

అంతే.... కాని ఆరోజు నుంచి లోపల నిద్ర పోయే వరాన్ని ప్రసాదించలేదు.

తర్వాత అయిదారు నెలల్లో నా కారుతో నేను చేసిన పొరపాటు మా ఆవిడ చేయించిన కార్యకలాపాలు వర్ణనాతీతం. ఒక చంద్రగ్రహణానికీ, ఒక సూర్యగ్రహణానికీ మా చుట్టుపక్కల ఆడవాళ్ళను సముద్ర స్నానాలకి తీసుకు వెళ్ళాను.... ఇడ్లీ పప్పు రుబ్బడానికి ఆలశ్యంగా ఇంట్లో ఉండిపోయిన పని మనిషిని వాళ్ళ యింటి దగ్గర దింపి వచ్చాను. హఠాత్తుగా బోయిలర్ వంట చెరుకు అవసరమయితే వెనక సీటులో కర్రలు వేయించుకు వచ్చాను. ఊరుకి ఎడంగా ఉన్న అత్తయ్యగారికి వెంకటగిరి చీరలు కావాలంటే నెలవారీగా వచ్చే బట్టల వ్యాపారిని నా కారులో తీసుకెళ్ళి ఆ అత్తయ్యగారి యిల్లు చూపించి వచ్చాను. వీధి చివర ఆచార్యులుగారి అమ్మాయికి తేలు కుడితే చచ్చినట్టు తేలు మంత్రగాడిని తీసుకు వచ్చాను.

ఇలా యింకా చాలా సాహసకృత్యాలు చేసేవాడినే కాని ఒక రోజు ఉన్నట్టుండి మా ఆవిడ నాతో చెప్పింది. "ఏమండీ! వెంటనే కారు అమ్మేయండి" అని.

నా నెత్తిన పిడుగు పడ్డంత షాక్ అయాను.

''అదేమిటీ!'' అన్నాను.

''అదంతేనండీ! అది అమ్మే వరకు దానితో మీరు తిరక్కండి.... ఇంట్లోనే వుంచేయండి'' అంః

''అది వుంది కదా అని సైకిలు అమ్మేశాను. ఇప్పుడు సైకిలు కొనుక్కునేవరకయినా తిరగవీ! ఇప్పుడు నడవాలంటే ఛస్తాను. అదీగాక ఉన్నపాటునే యిలాంటి పుష్పక విమానాన్ని ఎవరుకొంటారు? ఆ మేజర్ అదృష్టానికి మనం దొరికాం కాని—'' అన్నాను.

''ఏమయినా సరే. యిక ఆ కారులో మీరు ఎక్కడానికి వీల్లేదు.''

''కారణం ఏమీటి?''

''నన్నడగకండి'' అంది.

అది ఏ విషయమయినా చెప్పకూడదని మా ఆవిడ నిర్ణయించాక యింక అడిగినా ప్రయోజనం లేదని నాకు తెలుసు.

ఏమయినా ఇదేదో మంచికే వచ్చిందనుకొన్నాను. ఎవరూ కొంటారని నమ్మకం లేకపోయినా యిద్దరు బ్రోకర్లకి వెంటనే వర్తమానం చెప్పాను. కారుని వాకిట్లోనే కాస్త యిుపింటా వుంచి దాని మీద పెద్ద పరదా కప్పాను.

నెలరోజులకి ఒక పార్టీని తెచ్చాడు బ్రోకర్! రేపు పార్టీ వస్తారనగా - మా ఆవిడతో చెప్పాను. ''ఆ పరదాతీసి కాస్త పని మనిషిచేత తుడిపించు'' అని. సరేనంది.

కాని మర్నాటి ఉదయమే చరచరా వచ్చింది. ''కారు యిప్పట్లో అమ్మడానికి వీల్లేదండీ!'' అంది.

''మళ్ళీ ఏమొచ్చిందే!'' అన్నాను చిరాకు వచ్చిపోయి.

''ఏమొచ్చిందో రండి చూద్దురుగాని'' అని చెయ్యి పుచ్చుకు లాకెళ్ళింది. చూశాక నాకు మతిపోయింది. మా ఇంట్లో రోజూ తిరిగే ఎర్రమచ్చల తెల్ల పిల్లి కారు వెనక సీట్లో పిల్లల్ని పెట్టింది. చిరిగిన సీట్ కవర్లలోంచి పీచు బయటికి లాగి వాటి మధ్య వెచ్చగా పిల్లల్ని పడుకో పెట్టింది.

నాకు వొళ్ళు మండిపోయింది. ''ఇంకా చూస్తావేం? ఆ దరిద్రగొట్టు పిల్లిని బయటికి తరమవేమే!'' అని కర్ర తియ్య బోయాను.

నన్ను వెంటనే ఆపింది. ''అయ్యో! పాపం బాలింతరాలిని యిబ్బంది పెట్టడం మహా పాపమండీ! పిచ్చిముండ మనల్ని శపిస్తుంది. పిల్లి శాపం మంచిది కాదంటారు'' అంది.

పిల్లి యిచ్చే శాపం మాట దేవుడెరుగు నా కారుకి బేరం పోతోందని ఒప్పించ లేకపోయాను. ఫలితం కారుకి వచ్చిన పార్టీ తిరిగిపోయారు.

తర్వాత ఆరు నెలలవరకూ ఏ పార్టీని తీసుకురాలేకపోయాడు బ్రోకరు. ఈలోగా కారుకి చాలా అన్యాయాలు జరిగిపోయాయి. పిల్లి పిల్లల్ని తీసుకుని మరెక్కడికో వలసపోయింది. కాని బొగ్గుల లారీ వాడు మా వాకిట్లో లారీని వెనక్కి నడిపి కారుకి ఢీకొట్టాడు. వెనక మడ్ గార్డులు రెండూ వంగిపోయాయి. ఒక రోజు తీవ్రంగా వర్షం పడి ఒక కొబ్బరి మట్ట, నాలుగు కాయలూ కారు మీద సరాసరి పడ్డాయి.

టాపు బాగా లొత్తలు పడిపోయింది. టైర్లలో గాలిపోయి క్రమంగా నేలని కరుచుకున్నాయి. కారు హారన్ ఎవరో ఎత్తుకుపోయారు. తలుపుల హాండిల్స్ తుప్పు పట్టిపోయాయి. ఎట్టకేలకు ఒక గేరేజ్ యజమానిని లాక్కొచ్చాడు బ్రోకర్. కారంతటినీ కదిపి చూసి అక్కడా అక్కడా స్పేర్ పార్టులు పనికి వస్తాయని చెప్పి రెండువేలకి బేరం కుదుర్చుకుని వెళ్ళిపోయాడు. నేను మాత్రం మేజరీకంటె తొందరగా ఆ బేరానికి ఒప్పుకున్నాను - ఆలశ్యంచేస్తే అదీ రాదని భయపడి. తర్వాత యింటి ముందు వేసిన కర్రదుంగని చీల్చినట్టుగా పదిమంది వచ్చి కారుని ఏ పార్టుకి ఆ పార్టు విప్పి తలో చక్రం, సీటు, హాండిల్ పట్టుకు వెళ్ళారు.

కారు పూర్తిగా వెళ్ళిపోయిన రోజు మా యింట్లో సత్యన్నారాయణ వ్రతం ఏర్పాటుచేసింది మా ఆవిడ. దాన్ని పంపించి వెయ్యడానికి మా ఆవిడ అంత ఆతృత, అంత తతంగం ఎందుకు పడిందో అర్థం కాలేదు. ఆఖరికి పూజ చేయించిన పురోహితుడు చెప్పాడు. అతనికి శాస్త్రపాటి జ్యోతిష్యం కూడా తెలుసును లెండి.

"అయ్యా తమకు జీవితంలో వాహన గండం వుందని చెప్పానండీ. అది ప్రాణానికే ముప్పు తేవచ్చునని రాసి వుందండి. అది విన్నాక అమ్మగారికి కరచరణాలు ఆడలేదు." అన్నాడు.

నాకు నోట మాట రాలేదు. "అంత మంచి విషయం చెప్పడానికి యింత ఆలశ్యంగా తగలపడ్డావేమయ్యా? పది నెలల కిందటే చెప్పి వుంటే నాకీ శ్రమా, మూడువేలు నష్టం తప్పేది కాదా!" అనుకొన్నాను కారు ద్వారా పక్కింటి ఆవిడ మీద ఆధిక్యత సాధించాలన్న పట్టుదల కంటె, భర్త శ్రేయస్సు మా ఆవిడని జయించడం నా అదృష్టం. ఆ తర్వాత ఎప్పుడూ పొరుగు వాళ్ళ కారులో కూడా నన్ను ఎక్కనివ్వలేదు మా ఆవిడ!

ఇప్పటికీ అద్దం చూసుకున్నప్పుడల్లా మా ఆవిడా; మారిస్ మైనరూ, మడత మంచాలూ గుర్తుచేస్తుంటుంది పోయిన నా ముందు పన్ను.